

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

## – పవని నిర్మల ప్రభావతి

పద్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్థం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల "చైతన్య రాహిత్యంలో స్త్రీ"

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

**గోపాలరావుతో** కమల పెళ్లి తిరుపతిలో జరిగి పోయింది గోపాలరావు హైదరాబాదులో సెక్రటేరియట్ లో ఉద్యోగం చేస్తున్నాడు. వయసు ముప్పై ఐదు పైబడి వుంటాయి. శ్రీ వైష్ణవ సాంప్రదాయంలో పుట్టి పెరిగిన గోపాలాచారి ఉద్యోగంలో చేరాకే గోపాలరావుగా మారాడు. సన్నిహితులు 'గోపాలాచారి' అనే పిలుస్తారు.

అందాక అతగాడు పెళ్లాడక పోవటానికి చాలా కారణాలున్నాయి. తన ఇద్దరు చెల్లాయిలకు పెళ్ళిళ్ళు చేసిగానీ పెళ్లాడకూడదనుకున్నాడు. తోటి ఉద్యోగస్తులలో చాలా మంది పై సంపాదన చేస్తున్నా తను మటుకు నీతిగా, నిజాయితీగా వున్నాడు.

చెల్లాయిల పెళ్ళిళ్ళు చేసి, ఆ అప్పు చాలా వరకూ తీర్చి, తర్వాత తన పెళ్ళికి సంసిద్ధత తెలిపాడు.

ఇప్పటికీ గోపాలరావు చాలా నియమ నిష్టలు గల వ్యక్తి. తెల్లారు ఝామున నిద్ర లేచి, ఇంట్లో పూజా మందిరం వద్ద కూర్చుంటాడు. 'దీక్ష' పుచ్చుకుని ముద్రాంకితాలు అయినది లగాయితూ ఈ నాటివరకూ అతగాడే రోజూ దేవతార్చన, ధ్యానం, జపం చేయకుండా ఉండలేదు.

ఇంతటి సాంప్రదాయ సిద్దమైన కుర్రాణ్ణి మరి చూడం అన్నారు బంధువులు కమలతో.

కానీ కమలకు గోపాలరావు ఛామనఛాయ రంగూ, నుదుటి మీద తిరుచూర్ణం నామం, క్రాపులో కలిసిపోయినట్లున్నా కాస్త కనిపించే పిలకముడి బొత్తిగా నచ్చలేదు.

ఆ మాటే గునుస్తూ పిన్నితో అంది.

పిన్ని గయ్యి మంది.

"ఇలా వంకలు పెట్టి అన్ని సంబందాలనీ కాలదన్నావు. మీ అమ్మా,నాన్నలను  క్షోభ పెట్టావు. నీ దిగులుతోనే మీ అమ్మా నాన్నా లోలోపల కుళ్ళిపోయారు. పదిహేను వేలు కట్నం, ఆరువేలు పెళ్లిఖర్చు సరిపోతుంది ఈ సంబంధం అయితే. ఇంకా ఇంకా పెద్ద సంబంధాలు ఎవరు  తేగలరు? తెచ్చినా డబ్బెవరు పెడతారు? ఎవరి సంసారం బరువు వాళ్ళకుంది. కేశవరావు గారిస్తారంటావూ. ముక్కూ మొహం తెలీని పెద్దమనిషి యిస్తామంటే మాత్రం పుచ్చుకోవటం మనకు భావ్యమా? పైగా వాళ్ళమ్మాయి పెళ్లి సమయంలో నీకథేదో కొంత వుందని ఇప్పటికే అందరూ చెవులు కొరుక్కుంటున్నారు. నీ బరువు  తాత్కాలికంగా వేసుకున్నామే గానీ, ఇక శాశ్వతంగా నీకు నచ్చే సంబంధం (అది ఉందో లేదో ఎవరికెరుక) వచ్చే వరకు నీ బరువు మోయలేం" అంది స్పష్టంగా.

కమలకి అర్ధమయింది. ఇక తను అతిగా బయటపడి లాభం లేదు. నిజానికి గోపాలరావు కంటే నాన్న తెచ్చిన ఇంజనీరు, లెక్చరరు, బ్యాంక్ జాబ్ చేస్తుండినతనూ చాలా బావున్నారు. వయసులోనూ చిన్నవాళ్ళు.

కానీ తనకప్పుడు నాన్న మీద ఏదో సాధింపు, లోలోపల సుధీర్ కంటే లక్షాధికారి సంబంధం రావాలని కోరిక. అలా వస్తే తనూ, తన భర్తా పనిమాలీ బాంబే వెళ్లి శాంతి, సుధీర్ లకు తన అంతస్తు చూపించి రావాలని కోరికగా వుండేది.

"ఇదీ వద్దని నువ్వు ముఖం మాడ్చుకుంటే మాదేం పోయే. సంబంధం వదులు కుందాం. కానీ ఆలోచించు కమలా! ఈ సారి నీకు రాబోయే సంబంధాలు రెండో పెళ్లివీ, మూడో పెళ్లివీ అయితే మాత్రం మమ్మల్ని తప్పు పట్టకు. అప్పుడు విధి లేక నువ్వే ఒప్పుకుంటావు. నువ్విలా పెళ్లి లేకుండా మా దగ్గరే వుండి పోయినా నీ డబ్బు నీ తిండికీ బట్టలకూ ఖర్చు చేస్తాం.

మాకేం అభ్యంతరం లేదు. కానీ ఎట్టి పరిస్థితిలోనూ నిన్ను అన్యకులస్తులకిచ్చి పెళ్లి చెయ్యం. చేసుకోనివ్వం. అంతే" అంది పిన్ని.

ఉలిక్కిపడి తన ఆలోచనలు వదులుకుంది కమల.

గోపాలరావు భార్యగా హైదరాబాదులో అడుగెట్టింది కమల.

రోజులు సంవత్సరాలు దొర్లి పోతున్నాయి. ఐదేళ్ళు గిర్రున తిరిగిపోయాయి. గోపాలరావుకు ఏ బాదర బందీలు లేవు. సంవత్సరాని కోసారెప్పుడో ఇద్దరు చెల్లాయిలు, బావమరదులూ పుట్టిల్లంటూ గోపాలరావు దగ్గరకు వస్తారు. పది రోజులుంటారు. పసుపు కుంకుమలతో చెరొక చీరె, రవికగుడ్డ యిస్తే పుచ్చుక తృప్తిగా వెళ్లి పోతారు.

"వదినా! మా అన్నయ్య చాలా మంచివాడు. నీ అదృష్టం కొద్దీ నీకు భర్తగా లభ్యమయినాడు. మా అమ్మా నాన్నా పోయాక, మమ్మల్ని కన్నతండ్రిలా చూచి పెళ్ళిళ్ళు చేశాడు. మాకు పెళ్ళిళ్ళు అయ్యే వరకూ తాను పెళ్లాడనని శపథం చేశాడు. కారణం తను పెళ్ళాడేస్తే ఆ వచ్చే వదిన మమ్మల్ని సరిగా చూసుకోదని భయం ఒకటీ, తనకూ పిల్లలూ ఝంఝాటం మొదలయితే ఇక ఆ అవసరాలకు డబ్బు సరి చూచుకునే స్వార్థంలో మాకు మంచి సంబంధాలు తేలేమోననే భయం మరొకటి. ఇంత దూరం ఆలోచించే అన్నలు ఎందరు ఉన్నారంటావు? మమ్మల్ని మంచి వాళ్ళకిచ్చి పెళ్ళిళ్ళు చేయించాడు. మేమూ సుఖంగా ఉన్నాం. అన్నయ్య చిన్నతనంలోనే వైష్ణవ సాంప్రదాయ దీక్ష తీసుకున్నాడు. తు.చ. తప్పకుండా అనుసరిస్తాడు. ఇంత నిష్టగా నిర్వర్తించేవారూ అరుదే సుమా." అలా చెబుతుంటారు వాళ్ళిద్దరూ.

కమలకు ఇదంతా చాదస్తంగా తోస్తుంది. పూజా పునస్కారాలు ఒక్కటే జీవిత ధ్యేయమా? జీవితంలో 'భోగం' అవసరం లేదా? 'తృప్తీ తృప్తి తృప్తి ' ఇదే పలవరింతా? తృప్తికి కొలమానం ఏమిటసలు? తనకు పిల్లలు కలగలేదు. థాంక్ గాడ్! అసలొద్దు కూడాను.

గోపాలరావుకు వచ్చే వెయ్యిరూపాయల జీతంలో తామిద్దరూ సుఖంగానే బ్రతుకుతున్నాము అంటాడు అతగాడు.

ఏం సుఖం? రెండువందల యాభై రూపాయలతో రెండు పెద్ద గదులు, ఓ చిన్న వరండా, మరో చిన్న కిచెను, బాత్ రూం లావెటరీ గల ఈ బంగాళా బహుశా బొంబాయిలో సుధీర్, శాంతిల బంగళాలో నౌకర్ల గది అంత ఉందేమో ఈ ఇల్లు!

"మీ ఇద్దరికీ బోలెడంత ఇల్లు. ఈ సిటీలో ఇంత యింట్లో ఆరుగురు ఏడుగురు వుంటారు సాధారణంగా" అంటారు ఇరుగు పొరుగు ఇల్లాళ్ళు గొప్పగా ఈర్ష్యగా.

నవ్వొస్తుంది కమలకి. ఏం మనుషులు, అంతా గోపాలరావుకి అక్క చెల్లెళ్ళ లాటి వాళ్ళే. ఈ చిన్న ఇల్లు తృప్తి. ఇది దొరికితే చాలన్న తృప్తి. ఎక్కడి కక్కడే తృప్తి.

పైకి ఎదగాలనీ, ఆకాశాన్నందుకోవాలనీ ఆశయం లేని బ్రతుకులివి.

చైతన్యవంతంగా సాగిపోవాలనే ఊహ కూడా లేని, రాని చైతన్య రాహిత్యపు జీవితాలవి. తనకవి నచ్చావు.

గోపాలరావు నెల జీతం అందుకున్న నాడే ఓ రెండువందలు తామిద్దరి పేరుతో బ్యాంకులో వేసేసి మరీ వస్తాడు. దానికి 'ముందు చూపు' అంటాడు.

"అక్కర లేవైనా వస్తే ఆ మాత్రం మన డబ్బులు వుండాలి. ఎవరినేనా అడగటం ఎంత బాధో, లేదనిపించుకోవటం మరీ బాధ" అంటూ ఏవో లెక్చర్లిస్తాడు. తన ఊహా పథంలో అందమైన సోఫా సెట్లున్నాయి. రేడియో గ్రాములున్నాయి. రికార్డు ప్లేయర్లున్నాయి, టేప్ రికార్డర్లున్నాయి. ఇంకా ఇంకా మరెన్నో వున్నాయి. అవన్నీ వాయిదాల పద్ధతిలో అమర్చుకోవచ్చు.

'అదనపు సంపాదనతో' అమర్చుకోవచ్చు. కానీ గోపాలరావు నవ్వేస్తాడు.

"నువ్వు చెప్పేవన్నీ చచ్చీ చెడీ సాధించామనుకో కమలా? అప్పుడూ మరో కొత్తవి ఉండనే వుంటాయి. మనిషి కోరికల్ని కొలిచే కొలమానం గానీ, కోరికల్ని ఆపే సాధనం గానీ భగవంతుడు ఇంతవరకూ కనిపెట్టలేదు సుమా."

ఏమితో ఆ సమాధానం తనకి నచ్చదు. సరిపెట్టుకోక తప్పని పరిస్థితి.

అంతా బడ్జెట్ ప్రకారం యింటి ఖర్చు, సరదాలు ఉండాలంటాడు గోపాలరావు. అలా అని చిన్న చిన్న సరదాలకి అడ్డు చెప్పడు. కానీ ప్రతీ పైసా ఖర్చుకీ ఓ పరమార్ధం వుండి తీరాలంటాడు.

శాపవశాత్తూ సెక్రటేరియట్ లో ఉద్యోగం చేస్తూ సిటీలో బ్రతుకుతున్నాడేమో గానీ, లేకపోతే ముక్కు మూసుక జపతపాలు చేసుకుంటూ అరణ్యం మధ్యలో ఆశ్రమాలు నిర్మించుకుని జీవితాలు యజ్ఞ యాగాలకూ, జపతపాలకూ అంకితం చేసే ఎవరో ముని పుంగవుడుగా వుండ వలసిన వాడేమో ఈ తన భర్త అనే హేళన భావం కలుగుతుంటుంది అప్పుడప్పుడూ.

అలా తను హేళన చేసినా ఏమీ అనడు. నవ్వి ఊరుకుంటాడు. అతి ప్రేమగా దగ్గరకు తీసుకుని చెబుతాడు.

“నీకు అతి పేదరికం, అతి కష్టాలు అనేవి అనుభవం లోకి వచ్చి వుండవు. నిన్ను ఆఖరు కూతురివనో, డాక్టర్ని చేయాలనో మీ అమ్మా నాన్నలు వున్నంతలో ముద్దుగానే చూశారని చెబుతూంటావు నువ్వు. కానీ నేనలా కాదు. మా చెల్లాయిలూ కాదు,

ఆలయ పూజారిగా వుంటుండిన మా నాన్నగారికి, ఆలయం తరపున ఇవ్వబడిన మాన్యాల మీద పైసా వచ్చేది కాదు. అలాగని ఆలయాన్నీ, ఆలయంలోని దేవుడినీ, ఆలయానికి వచ్చే భక్తులనీ నిలువుదోపిడీ చేసుకు తినే కొందరి పూజారి కుటుంబాలలోని స్వార్థమూ, నీతి బాహ్యమూ, దైవ ద్రోహమూ మాకు లేవు.

మరెలాగ బ్రతకటం? కేవలం గ్రామస్తుల మంచితనం మీదా, గ్రామస్తులకు ఎన్నో ఉపకారాలు చేసి వారి నుంచి గౌరవం పొందే నిరంతర కృషి మీదా కుటుంబం లాక్కు వచ్చే వారు.

మాకు తెలుసు మనుషుల విలువ, మంచితనపు విలువ... అందుకు మనం ఎంత త్యాగం చెయ్యాలో, మనల్ని మనం ఎంత నిజాయితీగా మలుచుకోవాలో మాకు తెలుసు.

నేను ఉద్యోగంలో చేరాకే నాన్నగారికి కాస్త ఊపిరి తిరిగింది. అయితే చెల్లాయిల పెళ్ళిళ్ళు చేయలేక పోయారు. ఆ ప్రయత్నంలో ఉండగానే అమ్మ నాన్న పుష్కరాలలో మరణించారు.

చెల్లాయిల బాధ్యత తీసుకున్నాను.

మరి నేను ఋషినో, గౌతముడినో, గోపాలరావునో అని నువ్వు నవ్వినా కూడా నాకు బాధ లేదు కమలా? నువ్వు అహల్యవి కావు. అంతే చాలు.”

“ఎందుకు కాదు?” నవ్వుతూ అంది తను.

“అదేమిటి?” అదిరిపడ్డట్లు అడిగాడు గోపాలరావు.

“ఈ మధ్య ఎందుకో చేసే పనేమీ లేకనో లేక ఏవో ఊహలు తలలో పరుగెడుతూనో చిన్న చిన్న కథలు బుర్రలో మెదులుతున్నాయి. అవి వ్రాయాలనిపిస్తోంది. రాసి పత్రికలకి పంపిస్తాను, కలంపేరు ‘అహల్య’ అని పెట్టుకుందామని అనిపిస్తోంది. ఆ పేరు చక్కగా వుంది. నేను ఎరిగి వున్నంతలో ఏ రచయిత్రికీ లేదా పేరు.”

“రాసుకో తప్పేముంది. కానీ పేరే మరేదేనా?”

“ఊహుఁ! నాకా పేరే నచ్చింది.”

"నీ యిష్టం."

రెండు మూడు కథలు 'అహల్య' పేరుతో రాసి పంపింది. కానీ తిరిగి వచ్చాయి.

సుధీర్ తో తన ప్రేమ, ప్రణయం, తమ మధ్య నడిచిన ఉత్తరాలు, ఏమేమిటో ఆలోచనలు... అవన్నీ ఫలించి వుంటే? తన జీవితం ఎలా వుండేది?

పెద్ద బంగళాలో నౌకర్ల చాకర్ల మధ్య కారులో, విమానాల్లో, ఊటీలో, కాశ్మీరులో, విదేశాలలో...

ఏవేవో కలలు, కమ్మని కలలు, నిజం కానివీ, కాలేనివీ, తెలిసీ కలలు...

అవే కాగితాల మీద అక్షరాల రూపంలో, కథల రూపంలో అందంగా సాగుతున్నాయి,

హఠాత్తుగా ఈ కలల కథ ఒకటి వో పత్రికలో  అచ్చై వచ్చి, పాఠకులలో మాంచి రెస్పాన్స్ కలిగించింది.

'అహల్య' రచయిత్రి గా మారింది.

ఆమె కలం కలల కథలు సృష్టిస్తోంది కోకొల్లలుగా, ఆమె హృదయం మాత్రం ఆ కలలకు అనుగుణంగా తన జీవితం, తన భర్త లేదేనన్న నిరంతర అసంతృప్తితో వేగిపోతూ వుంది.

'అహల్య' అన్న కలం పేరుతో కథలు వ్రాస్తున్న కమలకు కొద్ది కాలంలోనే మంచి పేరు వచ్చేసింది. నిజానికి ఆమె కథలలో, నవలలో వ్రాస్తున్నదేమిటో నిజమయిన విమర్శకులకూ, సాహిత్యాభిమానులకూ అంతు  బట్టటం లేదు.

కానీ ఆమె రచనలలో ఆమె హృదయం అట్టడుగు పొరల్లో తండ్రి మీద పేరుకుపోయిన ద్వేషం ప్రతిబింబిస్తుంది, ఒక్కొక్కసారి కొన్ని పాత్రలలో. ఆ ద్వేషాగ్ని కలల్ని ఆమె హృదయం అనుక్షణం అనుభవిస్తున్నదే కనుక ఏ విలన్ పాత్ర ద్వారానో, సంభాషణలలో పలికిస్తుందా ద్వేషాన్ని.

అది అత్యంత సహజ సన్నివేశంగా అతికిపోతోంది నవలలో. సుధీర్ నూ, అతగాడి డాబునూ దర్పాన్నీ పిచ్చిగా ప్రేమించింది కాబట్టి, ఆమె చిత్రిస్తున్న నాయక పాత్రలో పరోక్షంగా సుధీర్ రూపం, సుధీర్ భోగం, వాక్చాతుర్యం ప్రతిబింబిస్తున్నాయి. ఇక సుధీర్ ను తాను పెళ్లాడ లేక పోవటంతో నిరాశకూ, నిస్పృహకూ లోనైన ఆమె హృదయం భగ్న ప్రేమలోని విషాదాన్ని అత్యంత సహజంగా చిత్రిస్తోందామె కలల కథలలో.

భర్త గోపాలరావు మీద భర్త అన్న గౌరవం ఈ నాటికీ ఏర్పరచుకోలేక పోగా,అతగాడి ప్రేమ కేవలం బలహీనతగా, చేతకానితనంగా మాత్రమే కనిపించి, ‘భార్యల్ని హింసించే భర్తలలో అతగాడిని ఊహించుకుని, తనక్కలిగే చులకన భావాన్ని, హేళననూ, వ్యంగ్యాన్నీ, జుగుప్సనూ కొందరు భర్త పాత్రలను సృష్టించి వెల్లడి చేస్తోంది.

ఇక తన కోరికలూ, తనకు కావలసిన ఇంద్రభోగాన్ని, ఊహలనూ తన నాయికకు ఆపాదించి ఆ పాత్రను గాలిలో పల్టీలు కొట్టిస్తోంది.

ఇలా తనలో కలిగే భావ పరివర్తనలనే పాత్రలుగా మలచి ఓ విలక్షణమయిన శైలిలో, వినూత్న కథా కథనంతో పాఠకుల మీద గుప్పించేస్తోంది అహల్య.

మంత్రముగ్ధులై పోతున్నారు పాఠకులు. పత్రికల నుంచి పారితోషికం వస్తోంది ఓ మోస్తరుగా.

“నీకు వస్తున్న డబ్బు నీ పేరనే బ్యాంకులో వేద్దాం కమలా” అన్నాడు గోపాలరావు ఓ రోజు.

“ఒద్దొద్దు. నేను కొన్ని వస్తువులు కొనుక్కోవాలి” అంది కమల.

“అలాగే, నీ యిష్టం.”

ఇంట్లో కొద్దిపాటి ఫాన్సీ వస్తువులూ, ఫర్నిచర్ అమర్చింది. ‘ఇంకా కావాలి. ఇంకా కావాలి.” లోపల్నుంచి ఏదో భూతం అరుపులా ఘోష.

ఓ రోజు కమలకో ఉత్తరం వచ్చింది. అది వో ప్రఖ్యాత పత్రిక నుండి రీ డైరెక్టు చేయబడి వచ్చింది.

“అహల్యగారికి,

నమస్కారం. సాహిత్యాకాశంలో తళుక్కున మెరిసి ఒక్కసారిగా ప్రకాశం పుంజుకున్న మీకు నా అభినందనలు. మీ కథలు, ఒకటి రెండు నవలలు చదివాను. మీ అభిమాన పాఠకుణ్ణని చెప్పుకోను. కారణం నాకు సాహిత్యం రెండో ప్రాణం గనుక. చేతికి అందిన పుస్తకమల్లా కొని చదవటమో, గైకొని చదవటమో చేస్తుంటాను గనుక మీ రచనలన్నీ పరిశీలించాను.

మీరు వ్రాస్తున్న రచనల సంఖ్య పెరుగుతోందే తప్ప, వాటిలో సాహిత్యం గానీ, సాహిత్య ప్రయోజనం కానీ కించిత్తు పెరగటం లేదు. మీరు వర్ధమాన రచయిత్రి.

మీ రచనలు బాగా పరిణతి చెందాలంటే ప్రఖ్యాత రచయితల రచయిత్రుల రచనలు బాగా చదవండి. మన సంస్కృతిని ప్రతిబింబించే రామాయణ, భారత, భాగవతాది పురాణ గ్రంధాలు బాగా చదివి అర్ధం చేసుకోండి.

ప్రేమ ఒక్కటే మన దేశంలోని సమస్య కాదు. పగ ఒక్కటే మన మనుష్యుల ధ్యేయం కాదు. భార్యాభర్తలిద్దరిలో ఎవరిలో లోపాలున్నా రెండవ వారు సర్దుకు పోవటమూ, క్షమించటమూ, ఒకరికొకరు తోడు నీడగా ఉండటమూ అన్నది మన వైవాహిక వ్యవస్థలోని మొదటి గొప్పతనం. ఎక్కడో ఎవరో వో జంట జీవితం అందుకు భిన్నంగా ఉన్నంత మాత్రాన వైవాహిక వ్యవస్థే పనికి రాదంటూ సిద్దాంతీకరించటం భారతీయ మహిళగా మీరు చేయదగిన పని కాదు.

మీరు రచనలు చేయండి. కానీ అవి జాతిని జాగృతం చేసేవిగా వుండాలనే ధ్యేయం ఏర్పరచుకోండి. మీకున్న శైలికీ, మీ ప్రత్యేక కథా గమన చాతుర్యానికీ వో 'లక్ష్యం' అంటూ ఏర్పరచుకుని చిత్తశుద్దితో రచనలు చేస్తే మీ రచనలు చిరంజీవత్వం సాధిస్తాయి. లేకపోతే ఉదృతంగా వచ్చే ఉప్పెన నీటిలా, వరదలా, పంటల్నీ, పశువుల్నీ, మనుషుల్నీ నాశనం చేసే పెను తుఫాను గాలిలా సాహిత్యపు విలువల్ని సమూలంగా శాశనం చేస్తాయి మీ రచనలు. మీ రచనలను ఇప్పుడు పిచ్చిగా ప్రోత్సహించే పాఠకులే ఓ నాడు వాటిని తీవ్రంగా విమర్శిస్తారు.

సాహిత్యాభిమాని అయిన సోదరునిగా మీకు నేనీ సలహా యిస్తున్నాను. స్వీకరిస్తారా మంచిదే. లేదూ... సాహిత్యానికి మీ రచనల ద్వారా పట్టబోతున్న దుర్ధశకు నా సంపూర్ణ సానుభూతి. అంతే... మీ సంతకంతో కూడిన మీ జవాబు గానీ మీ ఫోటో గానీ ఏదీ కోరని,

మీ సోదరుడు

'చంద్రం'

ఆ ఉత్తరం చదివి చాలాసేపు ఆలోచనలో పడింది కమల.

రచనల సంఖ్య పెరుగున్న కొద్దీ మెచ్చుకుంటూ వచ్చే ఉత్తరాల సంఖ్య పెరుగుతోందే గానీ, ఇలా యింత నిర్మోహమాటంగా విమర్శించిన, నిజం చెప్పిన ఉత్తరం ఒక్కటీ రాలేదు. (బహుశా రాబోదు కూడా) క్రింద సంతకం ఒక్కటే ఉంది. అడ్రస్ కూడా ఇవ్వలేదితగాడు.

అంతలోనే ఆమెకు అహం తన్నుకు వచ్చింది. వందలాది పాఠకులు మెచ్చుకుంటూ ఉండగా, ఎవరో ఊరు పేరు లేని 'చంద్రం' ఒక్కడికీ నచ్చనంత మాత్రాన మునిగి పోయిందేమీ లేదనిపించింది. తన ధోరణిలో తాను సాగిపోతోందామె.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments